సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



అంతా మా ఇష్టం..!

ప్రజల సొమ్మేకదా.. మా ఇష్టం వచ్చినట్లు దోచుకుంటాం. మమ్ములను అడిగేదెవరను కున్నారు మూడు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు.

- 8లో



పూర్తిస్థాయిలో వినతుల పరిష్కారం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు.

- 8లో



ఫెన్సింగ్ పోటీలకు 13 మంది ఎంపిక

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

- 8లో

న్యూస్‌రీల్

పోక్సోకేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష



నిందితుడు ధర్మాన ప్రసాదరావు, అలియాస్ రుషికుమార్

విజయనగరం క్రైమ్: పోక్సోకేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.20వేలు జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో కోర్టు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించిందని ఎస్పీ ఎం. దీపిక తెలిపారు. కేసు వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం తామర గ్రామానికి చెందిన ధర్మాన ప్రసాదరా వు అలియాస్ రుషికుమార్ ఓ బాలికపై లైంగిక నేరానికి పాల్పడడంతో విజయనగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం ప్రకారం దిశ మహిళా ఎస్ఐ కేటీఆర్.లక్ష్మి అప్పట్లో కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి విజయనగరం మహిళా దిశ డీఎస్పీ టి.త్రినాథ్ దర్యాప్తు పూర్తిచేసి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసును ప్రాధాన్యతా కేసుల జాబితాలో చేర్చి, ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తిచేశారు. నిందితుడు రుషికుమార్‌పై నేరం రుజువు కావడంతో స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు జడ్జి కె.నాగమణి 20 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.20వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. కేసులో పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా, వన్‌టౌన్ కోర్టు కానిస్టేబుల్ త్రినాథరావు, దిశ హెడ్ కానిస్టేబుల్ దివ్యజ్యోతి సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారన్నారు. పోక్సో కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్షపడేలా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ అభినందించారు.

రైలు నుంచి జారిపడిన బీటెక్ విద్యార్థి మృతి



మృతి చెందిన వెంకట సాయిఅభిరామ్

దొరవారిసత్రం (తిరుపతి జిల్లా): కలగుంట గ్రామ సమీపంలో రైలు నుంచి ప్రమాదవశాత్తు పడిపోయి బీటెక్ విద్యార్థి పక్కి వెంటసాయిఅభిరామ్(20) ఆదివారం రాత్రి మృతి చెందగా సోమవారం వెలుగుచూసింది. సూళ్లూరుపేట జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా రాజాం ప్రాంతానికి చెందిన వెంకటసాయిఅభిరామ్ చైన్నైలోని ఐఐటీ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గతవారం ప్రవేశ పరీక్షలు రాసే నిమిత్తం ఢిల్లీకి వెళ్లి తిరిగి చెన్నైకు దురంతో ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తున్న సమయంలో కలగుంట సమీపంలో రైలు నుంచి జారిపడి దుర్మరణం చెందాడు. జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రతి పంచాయతీపైనా ప్రగతి నివేదిక

విజయనగరం అర్బన్: గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధిని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రగతి సూచికలను ఏర్పాటు చేసిందని, అందుకు అనుగుణంగా నివేదికలు రూపొందించాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 23 రకాల సూచికలపై నివేదికలు తయారు చేయాలన్నారు. ఆయా పంచాయతీల్లో వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో సాధించిన ప్రగతిని నమోదుచేయాల్సి ఉంటుందన్నారు. పశుసంవర్థక, మహిళా శిశుసంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాలు, పోలీస్, గ్రామీణ అభివృద్ధి, రెవెన్యూ, విద్య, స్వయంసహాయక సంఘాలు, వైద్య ఆరోగ్యశాఖలకు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. అనంతరం అభివృద్ధి సూచికలను సీపీఓ పి.బాలాజీ జిల్లా అధికారులకు వివరించారు.

రాములోరి పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో రామచంద్ర స్వామి పవిత్రోత్సవాలకు ఆలయ అర్చకులు సోమవారం అంకురార్పణ చేశారు. స్వామికి ప్రాతఃకాలార్చన పూజలనంతరం యాగశాలలో విశేష హోమాలు చేపట్టి వెండి మంటపం వద్ద సీతారాముల కల్యాణం వేడుకగా జరిపించారు. సాయంత్రం ఆశీర్వచన మంటపంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం కార్యక్రమాలను వైఖానస ఆగమోక్తంగా జరిపించి పవిత్రోత్స వాలను ప్రారంభించారు. అర్చకులకు దేవ స్థాన ఈఓ కిషోర్‌కుమార్ దీక్షావస్త్రాలను పంపిణీ చేశారు. ఈనెల 11 వరకు ప్రత్యేక పూజ లు, హోమాలు జరిపించి .. 12న శాంతి కల్యా ణం, శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తామని చెప్పారు.

నవంబర్ 15 నుంచి ‘ఆడుదాం ఆంధ్రా’

- జిల్లాకు చేరిన క్రీడా కిట్లు
- 350 సచివాలయాల పరిధిలో క్రీడా పోటీల నిర్వహణ
- ప్రతి సచివాలయం పరిధిలో ప్రత్యేక క్రీడా స్థలం
- క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడలు
- జిల్లాలో 6 వేల క్రీడా పోటీలకు ఏర్పాట్లు
- క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు



జిల్లాకు చేరుకున్న క్రీడా పరికరాలు

పార్వతీపురం టౌన్:

గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. నవంబర్ 15న ప్రారంభమయ్యే ఆటల సందడికి ఏర్పాట్లు చకచకా చేస్తోంది. దేశ చరిత్రలో ఇప్పటిదాకా ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల పోటీలు సాగుతాయి. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 6వేల పోటీలు జరగనున్నాయి. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ ఖోఖో క్రీడలతో పాటు 3కే మారథాన్, యోగా, టెన్నీకాయిట్ పోటీలు నిర్వహణకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 350 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వం నుంచి మంజూరైన క్రీడా కిట్లను ఆయా సచివాలయాలకు సరఫరా చేస్తోంది.

విజేతలకు నగదు ప్రోత్సాహకాలు

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.35వేలు, రూ.15వేలు, రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను ప్రభుత్వం అందిస్తుంది. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.5 లక్షలు, రూ.3లక్షలు, రూ.2 లక్షలు అందజేయనుంది.

ప్రతిభకు పదును

ప్రతిభగల క్రీడాకారులను వెలికితీయడమేలక్ష్యంగా ప్రభుత్వం క్రీడాపోటీలు నిర్వహిస్తోంది. దీనికి అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు అంబటి రాయుడు, కరణం మల్లీశ్వరి, పీవీ సింధు, డి.హారిక, శ్రీకాంత్, వి.జ్యోతి సురేఖ వంటి వారిని అంబాసిడర్లుగా ప్రకటించి ఇందులో భాగస్వామ్యం చేసింది. స్ఫూర్తిని నింపేలా ఆటల పోటీలు సాగుతాయి. పోటీలకు వచ్చే క్రీడాకారులకు మంచి భోజనం సహా ఇతర సదుపాయాలు కల్పిస్తుంది.



బాక్సులలో క్రికెట్ క్రీడా సామగ్రి

జిల్లాకు చేరుకున్న క్రీడా పరికరాలు..

‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీలకు సంబంధించి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడా పరికరాలు జిల్లా కేంద్రానికి సోమవారం చేరుకున్నాయి. వాటిని సచివాలయాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటికి సంబంధించిన నమూనా కిట్లను జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఇటీవల పరిశీలించారు.

జిల్లాలో ఆరువేల పైచిలుకు క్రీడా పోటీలు



జిల్లాలో ఆరువేల పైచిలుకు క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. దీనికి సంబంధించి క్షేత్రస్థాయి నుంచి అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. క్రీడల నిర్వహణకు ప్రతి గ్రామం, మండల స్థాయిలో క్రీడా మైదానాలు సిద్ధం చేయాలని మండల స్థాయి అధికారులను ఆదేశించాం. కార్యక్రమ ఏర్పాట్ల పరిశీలనకు ప్రత్యేకాధికారిగా జాయింట్ కలెక్టర్ గోవిందరావును నియమించాం.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

క్రీడా పరికరాల సంఖ్య ఇలా..	
వివరాలు	పరికరాల సంఖ్య
బేసిక్ క్రికెట్ కిట్–మెన్	700
బేసిక్ క్రికెట్ కిట్–ఉమెన్	350
ప్రొఫెషనల్ క్రికెట్ కిట్–మెన్	30
ప్రొఫెషనల్ క్రికెట్ కిట్–ఉమెన్	15
క్రికెట్ లెదర్ బాల్స్	38
బ్యాడ్మింటన్ నైలాన్ నెట్	350
బ్యాడ్మింటన్ రాకెట్స్ స్టేజ్–1	2100
బ్యాడ్మింటన్ రాకెట్స్ స్టేజ్–2	120
నైలాన్ షెటిల్ కాక్ స్టేజ్–1	350
నైలాన్ సెటిల్ కాక్ స్టేజ్–2	700
వాలీబాల్ స్టేజ్–1	1050
వాలీబాల్ స్టేజ్–2	90
వాలీబాల్ నెట్	350
కబడ్డీ నీక్యాప్స్	500
ఖోఖో యాంక్లెట్స్	500
టెన్నీకాయిట్	700
టోపీలు	150
మెడల్స్	1710
సర్టిఫికెట్లు	1710

ప్రణాళికాబద్ధంగా..



ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణ నవంబర్ 15 నుంచి నిర్వహిస్తాం. దీనికోసం గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఆటస్థలాల పరిశీలన పూర్తిచేశాం. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేశాం.

– ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్

వాలీబాల్‌లో ‘విజయ’కేతనం

- ముగిసిన అండర్–17 వాలీబాల్ పోటీలు
- విజేతలుగా కడప, విజయనగరం జట్లు



బాలుర విభాగంలో విజయం సాధించిన విజయనగరం జట్టు

మైదుకూరు : మైదుకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–17 బాలుర, బాలికల వాలీబాల్ పోటీల్లో కడప, విజయనగరం జట్లు అదరగొట్టాయి. మైదుకూరు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరిగిన ఈ పోటీలు సోమవారం ముగిశాయి. స్థానిక మేధా డిఫెన్స్ అకాడమీ మైదానంలో ఒకటో కోర్టులో సోమవారం బాలుర విభాగంలో విజయనగరం– పశ్చిమగోదావరి జిల్లాల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా విజయనగరం విజేతగా నిలిచింది. రెండో కోర్టులో బాలికల విభాగంలో కడప–గుంటూరు జిల్లాల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కడప జట్టు ఘన విజయం సాధించింది. బాలుర విభాగంలో సెమీ ఫైనల్‌లో విజయనగరం జట్టు చేతిలో ఓడిపోయిన శ్రీకాకుళం, బాలికల విభాగంలో సెమీ ఫైనల్‌లో గుంటూరు జట్టుతో ఓడిపోయిన ప్రకాశం మూడో స్థానంలో సరిపెట్టుకున్నాయి. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆయన తనయుడు నాగిరెడ్డి విజేత జట్లకు నగదు బహుమతులను అందజేశారు. బాలికల, బాలుర విభాగంలో విజేతలుగా నిలిచిన కడప, విజయనగరం జట్లకు రూ.20 వేల చొప్పున, రెండో స్థానంలో నిలిచిన పశ్చిమగోదావరి, గుంటూరు జట్లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను ఆయా జట్ల కెప్టెన్, కోచ్ మేనేజర్లకు అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల జట్లకు రూ.5 వేల నగదును అందించారు.

అవ్వాతాతలకు తీపి కబురు



- వచ్చేఏడాది జనవరి నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3000
- మరో రూ.250 పెంచుతున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి
- ఆనందంలో పింఛన్‌దారులు
- జిల్లాలో పింఛన్‌దారుల సంఖ్య: 1,53,780
- ప్రతినెలా వీరికి రూ.2,750 చొప్పున ఇస్తున్నది: రూ.42.28 కోట్లు
- జనవరి నుంచి వీరికి రూ.3 వేల చొప్పున ఇవ్వనున్నది: రూ.46.13 కోట్లు

వీరఘట్టం: అవ్వాతాతలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీపికబురు అందించారు. వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రస్తుతం ఇస్తున్న రూ.2,750 పింఛన్ డబ్బులను మరో రూ.250 పెంచి మొత్తం రూ.3,000 అందజేస్తామని ప్రకటించారు. దీంతో రెండు వారాల ముందుగానే అవ్వాతాతలకు దసరా పండగ వచ్చినట్టయింది. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి విజయవాడ వేదికగా సోమవారం చేసిన ప్రకటనతో పింఛన్‌దారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. 2019లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు రూ.2వేలు ఉన్న పింఛన్‌ను రూ.250 పెంచుతూ తొలిసంతకం చేశారు. అప్పటి నుంచి ఏటా జనవరిలో రూ.250 చొప్పున పెంచుతూ ప్రస్తుతం రూ.2,750 అందజేస్తున్నారు.

జిల్లాలో లబ్ధిదారులు ఇలా..

పార్వతీపురం మన్యం జిల్లాలో ఇటీవల 14,895 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. వీరితో కలిపి వివిధ కేటగిరీల్లోని మొత్తం 1,53,780 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ప్రస్తుతం వీరందరికీ ప్రతినెలా రూ.42.28 కోట్లను ప్రభుత్వం అందజేస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటనతో పెంచనున్న రూ.250తో కలిపి ప్రతి ఒక్కరికీ రూ.3వేల చొప్పున రూ.46.13కోట్లు ప్రతినెలా పింఛన్‌దారులకు అందనుంది. జనవరి నుంచి అదనంగా మరో రూ.3.85 కోట్లను జిల్లాలోని పింఛన్‌దారులకు ప్రభుత్వం కేటాయించనుంది.

ఆహా ఒకటో తారీఖు...

సామాన్యుల నుంచి ఉద్యోగుల వరకు ఒకటో తారీఖు వచ్చిందంటే వామ్మో ఒకటో తారీఖు అంటూ ఆందోళన చెందుతుంటారు. అయితే, పింఛన్లు తీసుకుంటున్న అవ్వాతాతలు మాత్రం ఆహా ఒకటో తారీఖు అంటూ సంబరపడుతున్నారు. కోడి కూయకముందే వలంటీరు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తుండడంతో ఒకటో తారీఖు కోసం పింఛన్‌దారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్‌దారులకు రూ.1000లు ఇచ్చేవారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు నాలుగునెలల ముందు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను కాపీ కొట్టిన టీడీపీ ప్రభుత్వం పింఛన్‌ను రూ.2000 వేలకు పెంచింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఫింఛన్‌ను దశలవారీగా పెంచుతూ రూ.2,750 చేసింది. మరోవైపు దివ్యాంగులకు రూ.3 వేలు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు రూ. 5 వేలు చొప్పున పింఛన్‌డబ్బులు అందజేస్తోంది.

కొత్త సంవత్సరం నుంచి రూ.3000 పింఛన్



వైఎస్సార్ పింఛన్ కానుక వచ్చే ఏడాది జనవరి నెల నుంచి రూ.250 పెంచుతూ మొత్తం రూ.3 వేలు ఇవ్వనున్నాం. ప్రస్తుతం జిల్లాలో ప్రతినెలా రూ.42.28 కోట్లను పింఛన్ దారులకు అందజేస్తున్నాం. పెరిగిన మొత్తంతో కలిపి జనవరిలో రూ.46.12 కోట్లను పింఛన్‌దారులకు అందజేస్తాం.

– పి.కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

గిరిజనోత్పత్తులకు మార్కెట్ సదుపాయం

- ట్రైఫెడ్ సహకారంతో ముందుకు...
- జీసీసీ ఎం.డి.సురేష్‌కుమార్



మాట్లాడుతున్న జీసీసీ ఎండీ సురేష్‌కుమార్, పీఓ కల్పనాకుమారి, తదితరులు

సీతంపేట: గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు ట్రైఫెడ్ సహకారంతో మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) జి.సురేష్‌కుమార్ తెలిపారు. ఐటీడీఏలోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ట్రైబల్ ఆర్టిసన్ ఎంపెనల్‌మెంట్ మేళాలో ఆయన మాట్లాడారు. గిరిజన ఉత్పత్తులు వినియోగదారుల చెంతకు చేర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని వీడీవీకే (వన్‌ధన్‌వికాస్) కేంద్రాలు బాగా పనిచేస్తున్నాయని ప్రశంసించారు. స్వయంగా తను కొన్ని గ్రామాల్లోని యూనిట్లను పరిశీలించనట్టు తెలిపారు. ఇక్కడ ప్రాసెసింగ్ చేసిన ఉత్పత్తులకు మిగతా ప్రాంతంలో తయారయ్యే వాటి కంటే మంచి డిమాండ్ ఉందన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి మాట్లాడుతూ వీడీవీకే సభ్యులు మంచి వ్యాపార వేత్తలుగా ఎదగాలన్నారు. తయారుచేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే స్థాయికి చేరుకోవాలన్నారు. దీనికోసం స్కిల్ సెంటర్ ద్వారా మహిళలకు శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. ఇప్పటికే కొండచీపుర్లు, చింతపండు, పసుపు వంటివి ప్రాసెసింగ్ చేస్తున్నారన్నారు. ఉత్పత్తులకు మంచి ప్యాకింగ్ చేయాలన్నారు. ట్రైఫెడ్ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ శాంకే మాట్లాడుతూ దేశంలో అన్ని నగరాల్లో ఈ మేళాలు నిర్వహిస్తామని చెప్పారు. మన రాష్ట్రంలో మొదటిసారిగా ఈ తరహా మేళా ట్రైఫెడ్ ఆధ్వర్యంలో సీతంపేటలో నిర్వహించినట్టు తెలిపారు. దశలవారీగా అన్ని ఐటీడీఏల పరిధిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జీసీసీ డివిజనల్ మేనేజర్ జి.సంధ్యారాణి, మేనేజర్లు డి.కృష్ణ, జి.నరసింహులు, డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి, ఏఎంఓ పి.కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, సీఎంఓ చిరంజీవి, ఏపీడీ వెంకటరమణ, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.


ఆరోగ్య భరోసా

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్యభరోసా కల్పిస్తోంది. వ్యయప్రయాసలు లేకుండా ప్రజల చెంతనే వైద్యసేవలు అందిస్తోంది. జగనన్నఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద నిర్వహించే వైద్యశిబిరాలతో ఆరోగ్య సాంత్వన చేకూర్చుతోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఉచితంగా మందులు అందజేసి ఆయుష్షును పెంచుతోంది. అవసరమైన వారిని శస్త్రచికిత్సల కోసం, మెరుగైన వైద్యసేవల కోసం పెద్దాస్పత్రులకు రిఫర్ చేస్తోంది. రోగులు కోలుకునేవరకు ప్రత్యేక అధికారులతో పర్యవేక్షిస్తోంది. గతనెల 31వ తేదీ నుంచి సాగుతున్న వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగంచేసుకుంటున్నారు.

నేడు 14 చోట్ల జేఏఎస్ శిబిరాలు

నేడు జిల్లాలో 14 చోట్ల జేఏఎస్ వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్. బి జగన్నాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌సీల పరిధిలో వైద్య శిబిరాల నిర్వహణ ఇలా..

పీహెచ్‌సీ	శిబిరం నిర్వహించే ప్రాంతం
కోన	కోన, ఎంపీపీ స్కూల్
పెదపెంకి	పెదపెంకి ఎంపీయూపీ స్కూల్
రాజేంద్రవలస	రాజేంద్రవలస ఎంపీపీ స్కూల్
ఆర్.జమ్ము	ఆర్.జమ్ము సచివాలయం
ఆర్నాడ	ఆర్నాడ సచివాలయం
గనుదతీలేసు	గనుదతీలేసు సచివాలయం
జి.శివడ	జి.శివడ జీటీడబ్ల్యూఏహెచ్ఎస్
మూటకూడు	మూటకూడు ఎంపీపీ స్కూల్
పనుకువలస	పనుకువలస సచివాలయం
బాలగుడబ	బాలగుడబ, ఎంపీపీ స్కూల్
కందులపథం	కందులపథం సచివాలయం
కిల్లాడ	కిల్లాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల
లక్ష్మీపురం	లక్ష్మీపురం ఎంపీపీ స్కూల్
సంతనర్సిపురం	సంతనర్సిపురం సచివాలయం



జిల్లాలో సోమవారం నిర్వహించిన ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ శిబిరంలో అందించిన సేవలు ఇలా..	
మండలాలు	15
వైద్యశిబిరాలు	9
మొత్తం ఓపీలు	42,964
స్పెషలిస్టుల ఓపీలు	16,908
పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ఓపీలు	24,724
డీఎం	5,289
హెచ్‌టీఎన్	7,694
ఏఎన్‌సీ	922
పీఎన్‌సీ	492
అనీమియా	909
ల్యాబ్‌టెస్టులు	19,191
ఈసీజీ పరీక్షలు	865
రిఫరల్ కేసులు	236



పాచిపెంట జూనియర్ కళాశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన ప్రజలు

క్లుప్తంగా

గొర్రిపోతులు, కోళ్లు చోరీ

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామానికి సమీపంలో కళ్లంలోని షెడ్‌లో ఉంచి రూ.50 వేల విలువైన రెండు గొర్రిపోతులు, రెండు కోడి పుంజులను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారని గ్రామానికి చెందిన బొడ్డు స్వామినాయుడు తెలిపాడు. రాబోయే విజయదశమికి మూడు గొర్రిపోతులు, రెండు కోడిపుంజులను కొని మేపుతున్నానని, కళ్లంలో గల ఒక షెడ్‌లో వాటిని పెట్టి తాళాలు వేసి ఇంటికి వచ్చానని, తెల్లవారు జామున వెళ్లి చూసుకునేసరికి షెడ్ తాళాలు విరగ్గొగొట్టి రెండు గొర్రెపోతులు, రెండు కోడిపుంజలను ఎత్తుకుపోయినట్లు వాపోయాడు. ఈ మేరకు ఎల్.కోట పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

బస్సు నుంచి జారిపడి యువకుడి మృతి



మెంటాడ: రోదిస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

మెంటాడ: మండలంలోని ఆండ్ర గ్రామంలో సోమవారం బస్సునుంచి జారిపడి లోతుగెడ్డ గ్రామానికి చెందిన యువకుడు బోనిశివ (25) మృతి చెందాడు. ఆండ్ర పోలీస్‌ష్టేషన్ రైటర్ పైడితల్లి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శివ ఆండ్ర నుంచి మెంటాడ వెళ్లే బస్సు ఎక్కి పుట్‌పాత్‌పై నుంచి జారిపడ్డాడు. యువకుడు రోడ్డుమీద పడగానే తలకు గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మరొకరు..

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహనరావు పామాయిల్ తోటలో పనిచేస్తున్న చిట్టిబోయిన అప్పారావు (30) విద్యుత్ మోటార్ ఆన్‌చేస్తున్న సమయంలో ప్రమాద వశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరగడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామానికి చెందిన వాడు. మృతుడి అన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతిచెందిన అప్పారావు

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన పెద్ది శ్రీనివారావు(29) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. వ్యవసాయం, రాడ్‌బెండింగ్ పనులు చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్న శ్రీనివాస రావు ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి పూటుగా మద్యం తాగి 11 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో భార్య పెద్ది సబిత కాయగూరలు కొనేందుకు బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటి వచ్చి చూసేసరికి భర్త వాంతులు, విరోచనాలు చేసుకుని బాత్ రూమ్ దగ్గర అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. పక్కనే పురుగు మందు డబ్బా ఉండడంతో అనుమానం వచ్చి వెంటనే కుటుంబసభ్యులతో విజయనగరం తిరుమల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

17.638కేజీల గంజాయి స్వాధీనం

పాచిపెంట: ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తి నుంచి 17.638 కేజీల గంజాయి సాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఫకృద్దీన్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశా నుంచి ఆర్టీసీ బస్సులో సోమవారం గంజాయిని సాలూరు తరలిస్తుండగా పి.కోనవలస చెక్ పోస్టు వద్ద వాహనతనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పట్టుకున్నామని ఎస్సై చెప్పారు. నిందుతుడిని పట్టుకునే క్రమంలో పరారయ్యాడని, గంజాయి స్వాధీనం చేసుకుని నిందితుడికోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న హరికథా గానం

శృంగవరపుకోట: సంప్రదాయ బద్ధమైన సనాతన సాంస్కృతిక కళలలో ఒకటైన హరికథా గానం ప్రేక్షకులను, భక్తులను ఆకట్టుకుంది. సోమవారం సాయంత్రం పట్టణంలోని ధార గంగమ్మ ఆలయంలో ధర్మప్రచార వారోత్సవాలలో భాగంగా దేవాదాయశాఖ కె.నిర్మలా భాగవతార్ చేత రుద్రాక్ష మహిమ అనే హరికథా గానం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హరికథా భాగవతార్ కె.నిర్మల తన శ్రావ్యమైన కంఠంతో రుద్రాక్ష పుట్టుపూర్వోత్తరాలు, విశేషాలు, రుద్రాక్ష విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

అంతా మా ఇష్టం..!

- దోచుకుంటే అడిగేదెవరు?
- మూడు పంచాయతీల నుంచి రూ 2.17 లక్షలు స్వాహా
- సంబంధిత పంచాయతీల్లో టీడీపీ సానుభూతిపరులే సర్పంచ్‌లు



లచ్చింపేట గ్రామ పంచాయతీ కార్యాలయం

లక్కవరపుకోట: ప్రజల సొమ్మేకదా..మా ఇష్టం వచ్చినట్లు దోచుకుంటాం. మమ్ములను అడిగేదెవరనుకున్నారు మూడు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు. ఈ నేపథ్యంలో వారంతా ఒక్కటయ్యారు. ఇదే అదునుగా పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసిన 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.2.17 లక్షలు స్వాహా చేశారు. లేని పోస్టును, వ్యక్తిని సృష్టించి డబ్బులు కాజేశారు. ఈ నిధులను ఆయా గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సీఆర్‌పీ సుంకరి వేమన, మండల పరిషత్ అధికారులు వాటాలుగా పంచుకున్నారు.ఈ విషయం బయటకు పొక్కడంతో దిద్దుబాటు చర్యలకు పూనుకుంటున్నట్లు వినికిడి. ఈ స్వాహాకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. లక్కవరపుకోట మండలంలోని లచ్చింపేట, పోతంపేట, రంగరాయపురం పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు ఒక్కటై మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న రిసోర్స్‌పర్సన్ (ఎంఆర్‌పీ) సుంకరి వేమన భార్య ఉమ నాలుగేళ్లుగా ఆయా పంచాయతీల లావాదేవీలను నమోదు చేసే డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు నకిలీ పోస్టు సృష్టించారు. దీంతో పంచాయతీ పాలక వర్గాలు తీర్మానం చేసి నిధులను మళ్లించేశాయి. ఈ విధంగా ఈ ఏడాది మార్చి 20వ తేదీన లచ్చింపేట పంచాయతీ నుంచి రూ.82,458, పోతంపేట పంచాయతీ నుంచి రూ.48,744, గత ఏడాది మే 16వ తేదీన రంగరాయపురం పంచాయతీ నుంచి రూ.85,800 నగదు ఎస్.కోటలో గల ఆంధ్రాబ్యాంక్‌లోని ఉమ ఖాతా నంబర్ 173910100020791 కు బదిలీ చేశారు. ఆమె నాలుగు సంవత్సరాలుగా ఆయా గ్రామ పంచాయతీల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు పంచాయతీలు తీర్మానాలు చేశాయి, ఈ వ్యవహారంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంఆర్‌సీ సుంకరి వేమన ప్రధాన సూత్రధారులు. ఈ తతంగం పైకి పొక్కడంతో మిగతా సర్పంచ్‌ల్లో వణుకు మొదలైంది. మా పంచాయతీల్లో కూడా మాకు తెలియకుండా ఎంతెంత నగదు బదిలీ చేసుకున్నారో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధుల మళ్లింపుపై ఈఓపీఆర్‌డీ, ప్రస్తుతం ఎఫ్‌ఏసీ ఎంపీడీఓ జ్ఞానేశ్వర రావును వివరణ కోరగా సచివాలయంలో కంప్యూటర్ సహాయకులు వచ్చిన తరువాత 2019 అక్టోబర్-2 తేదీ నుంచి నగదు చెల్లించడం తగదన్నారు. ఈ నిధుల మళ్లింపు తన దృష్టికి వచ్చింది, పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలకు సిఫార్స్ చేస్తానని తెలిపారు.

లేని పోస్టును సృష్టించి

గత ప్రభుత్వం హయాంలో గ్రామ పంచాయతీల డిజిటల్ లావాదేవీలను కంప్యూటరీకరణ చేసేందుకు ప్రతి పంచాయతీకి ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఏర్పాటు చేశారు. వీరికి ఆయా పంచాయతీల జనాభా ప్రాతిపదికన నెలకు కొంత మొత్తం పంచాయతీ నిధుల నుంచి చెల్లించేవారు. ఈ వ్యవస్థను అప్పటి తెలుగుదేశం పార్టీ నాయకులు తమ సానుభూతి పరులను నాలుగు పంచాయతీలకు ఒకరిని చొప్పున నియమించుకున్నారు. వీరి పేర్లపై బ్యాంక్ ఖాతాలను ఏర్పాటు చేసి వారికి నచ్చిన విధంగా నిధులు మళ్లించుకునేవారు. ఈ అవినీతిని అరికట్టి, పారదర్శకమైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 2019 సంవత్సరం అక్టోబర్-2 వతేదీన గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. ప్రతి సచివాలయానికి 11 మంది సిబ్బందిని నియమించి అన్ని రకాల సేవలను అందజేయడంతో పాటు డిజిటల్ సహాయకులతో పంచాయతీ లావాదేవీలను కంప్యూటరీకరణ చేయిస్తున్నారు. ఇంత జరిగినప్పటికీ గతంలో టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్లను కొనసాగిస్తున్నట్లు పేర్కొంటూ వారికి పంచాయతీ నిధులను చెల్లించడం గమనార్హం. ఇప్పటికైనా ఈ తరహా చెల్లింపులపై సమగ్ర విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

133 దేవాలయాలకు నిధులు మంజూరు

- దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వి.వి.ప్రసాదరావు



బత్తిలి ఆలయ నిర్మాణానికి సూచనలు చేస్తున్న ఎ.సి ప్రసాదరావు, ఈఈ రమణారావు

భామిని: పార్వతీపురం మన్యం జిల్లాలో టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్టు ద్వారా దేవాలయాల పునరుద్ధరణ పథకంలో భాగంగా మూడు విడతల్లో 133 ఆలయాల ఎంపికై నట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వి.వి.ప్రసాదరావు సోమవారం తెలిపారు. ఈ మేరకు భామిని మండలంలో బత్తిలి, సింగిడి, బురుజోల, లివిరి గ్రామాల పరిధిలో మంజూరైన 4 దేవాలయాల పునరుద్ధరణ పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని ప్రతి దేవాలయానికి శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు చొప్పున నిధుల కేటాయింపు జరిగిందన్నారు. మూడవ విడతలో మంజూరైన బత్తిలి శివాలయంలో నిర్మాణ పనులపై దేవాదాయ శాఖ ఈఈ సీహెచ్.వి.రమణతో కలిసి నిర్వాహకులకు సూచనలు చేశారు. నిర్మాణాలు సాగుతున్న పనుల నాణ్యతాప్రమాణాలు గుర్తించారు. ఏఈఈలు సీహెచ్ సురేష్, బాబూజీ, జితేంద్ర, జిల్లా అర్చక సంఘం కార్యదర్శి మీగడ సంతోష్‌లు, ఆలయ కమిటీ సభ్యులు ఆయన వెంట ఉన్నారు.

అండర్-19 స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక



బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన జిల్లా అండర్ -19 స్కూల్ గేమ్స్ క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో సత్తా చాటాలని సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ ఆకాంక్షించారు. అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ ఇండోర్ స్టేడియంలో సోమవారం జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 40 మంది క్రీడాకారులు హాజరుకాగా..ఉత్తమ ప్రతిభ కనబరిచిన 5గురు బాలురు, 5గురు బాలికలు జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న అండర్-19 బాల, బాలికల అంతర్ జిల్లాల బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు సీఈఓ రామగోపాల్ తెలిపారు. ఎంపిక పోటీలను అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధి పొట్నూరు శ్రీరాములు పర్యవేక్షించారు.

11న హాకీ, త్రోబాల్ జట్ల ఎంపిక

అండర్-19 స్కూల్‌గేమ్స్ త్రోబాల్, హాకీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 11న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానంలో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు 2005 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన వారు అర్హులని, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

సమన్వయంతో అభివృద్ధి పనుల పూర్తి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

- కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన అభివృద్ధి పనులను సమన్వయంతో పూర్తి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సాలూరు నియోజకవర్గంలోని గడపగడపకు మన ప్రభుత్వం కింద ప్రాధాన్యతా క్రమంలో మంజూరైన పనుల ప్రగతిపై కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూరు మున్సిపాల్టీ, మక్కువ, పాచిపెంట మండలాల గ్రామ సచివాలయం పరిధిలో మంజూరైన పనులు, వివిధ దశల్లో ఉన్న ప్రగతిని సమీక్షించారు. అనంతరం అభివృద్ధి పనులు పూర్తయినప్పటికీ బిల్లులు అప్‌లోడ్ చేయకపోవడానికి గల కారణాలపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. అప్‌లోడ్ చేయని కారణంగా బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో మరో రూ. 11కోట్ల వరకు అభివృద్ధి పనులకు కేటాయించేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయని, ప్రస్తుతం మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, సాలూరు మున్సిపల్ కమిషనర్ టి.జయరాం, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు అండగా ఉందాం

సీనియర్ సిటిజన్లకు అండగా ఉందామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం సీనియర్ సిటిజన్ల సంక్షేమంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లను గౌరవించాలి. వారికి రక్షణగా నిలవాలి. వారికి అవసరమైన సదుపాయాలను కల్పించాలని ప్రజలను కోరారు. ప్రతి నెలా వారి జీవనానికి ఎలాంటి ఆటంకాలు ఉండకుండా వారికి అవసరమైన అన్ని వనరులు సమకూర్చాలని స్పష్టం చేశారు. సీనియర్ సిటిజన్ల హక్కులను పరిరక్షించాలని పేర్కొన్నారు. జిల్లాలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసిన కేసులు, తల్లిదండ్రుల ఆస్తులు అన్యాక్రాంతం చేసిన కేసుల వివరాలు అందాయన్నారు. వాటిపై ఆర్డీఓ తక్షణ చర్యలు చేపట్టి ఆస్తులను అప్పగించినట్లు తెలిపారు. కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్లతో స్నేహపూర్వక వాతావరణం ఉండాలని హితవు పలికారు. సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు, జేసీ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె. వెంకటరావు, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ పి. కిరణ్‌కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ. ప్రభాకరరావు పాల్గొన్నారు.

10న జూడో ఎంపికలు

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి ఉన్నత పాఠశాలలో ఈ నెల 10వ తేదీన అండర్ 14,17 విభాగాలలో బాల,బాలికలకు జూడో పోటీలకు ఎంపిక నిర్వహించనున్నామని జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. జూడో ఎంపికలకు హాజరుకానున్న విద్యార్థులు తాజా స్కూల్ స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని, అలాగే వారి వివరాలు అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసి ఉండాలని తెలిపారు.మరిన్ని వివరాల కోసం కొట్టక్కి వ్యాయామ ఉపాధ్యాయుడు బి.రత్నకిశోర్ ఫోన్ 9440127587 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వరుస చోరీలతో బెంబేలు



టౌన్‌సెంటర్ లేఅవుట్‌లో చోరీకి గురైన ఇంటి వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

విజయనగరం క్రైమ్: స్థానిక రింగురోడ్డు ప్రాంతంలో వరుసగా చోరీలు చేస్తూ దొంగలు భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నాళ్లుగా కృష్ణరాజపురం, టౌన్ సెంటర్ లే అవుట్ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. తాజాగా టౌన్ సెంటర్ లేఅవుట్‌లో దొంగలు ఓ ఇంట్లో బీభత్సం సృష్టించారు. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు పట్టుకుపోయినట్లు సమాచారం. బాధితులు డయల్ 100కి సమాచారమిచ్చారు. క్లూస్ టీమ్ పలు ఆధారాలు సేకరించింది. అయితే రింగురోడ్డు ప్రాంతంలో పటిష్ట నిఘా పెట్టకపోవడంతో దొంగలు వారి పనిని సులభంగా కానిచ్చేస్తున్నారని ఆ ప్రాంతవాసులు గగ్గోలు పెడుతున్నారు. కొన్నిరోజుల క్రితం మిధునం స్టోర్స్ వద్ద బైక్ చోరీకి గురైందని, ఇప్పటికైనా పోలీసులు ఇటువైపు దృష్టిసారించాలని కోరుతున్నారు.

ఫెన్సింగ్ పోటీలకు 13 మంది ఎంపిక



గంట్యాడ: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం ఝాన్సీ, ఫిజికల్ డైరెక్టర్లు



గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కొత్తగూడ విద్యార్థులు

గంట్యాడ: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో 9 మంది అమ్మాయి లు, నలుగురు అబ్బాయిలు ఉన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు పీవీఎస్ఎన్ రాజు, బైరెడ్డి శ్రీను, ప్రధాన ఉపాధ్యాయురాలు అలజంగి ఝాన్సీ అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఝాన్సీ మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడ వల్ల విద్యార్థులకు శారీరకంగా మానసికంగా మంచి చురుకుదనం, ఏకాగ్రత పెంపొందుతాయని చెప్పారు. ఇదే ఉత్సాహంతో మిగతా విద్యార్థులందరూ వివిధ క్రీడా పోటీలలో పాల్గొని మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఫెన్సింగ్ పోటీలకు కొత్తగూడ విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గుమ్మలక్ష్మీపురం మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ ఎస్.మాధవరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7న పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరిగిన స్కూల్‌గేమ్స్ జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అండర్ 14 విభాగంలో పాల్గొన్న బి.హర్షవర్ధన్, ఎన్.రీమన్, ఎం.కార్తీక్, ఎం.శేఖర్, అండర్ 17 విభాగంలో వై.శ్రీధర్, బి.జీవ, ఎం.సంతోష్, బి.రాజ్‌కుమార్, ఎ.సంతోష్ ఉత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలు ఎప్పుడు, ఎక్కడ జరుగుతాయో ఇంకా ప్రకటించలేదని, ఆ పోటీల్లో పాల్గొనేందుకు ఈ విద్యార్థులు సమయత్తమవుతున్నారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు 9 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల హెచ్‌ఎం నాగరాజు, డిప్యూటీ వార్డెన్ గంగారావు హర్షం వ్యక్తం చేశారు.

అర్జీదారులతో ఈకేవైసీ చేయించాలి



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాలు

విజయనగరం అర్బన్: జిల్లాలో వివిధ వర్గాల ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను అర్జీదారులకు సంతృప్తి కలిగించే రీతిలో ఏ విధంగా పరిష్కరిస్తున్నారనే అంశంపై అన్ని ప్రభుత్వ శాఖలు నివేదికలు అందజేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ శాఖ తమకు అందిన అర్జీల్లో సంతృప్తికరంగా పరిష్కరించిన వినతుల సమాచారంతో ఈ నివేదికలు వారంలోగా ఇవ్వాలని చెప్పారు. దీంతో పాటు ఆయా మండలాల్లో సంతృప్తికర వినతుల పరిష్కారంపై మండలాల ప్రత్యేక అధికారులు కూడా నివేదికలు అందించాలన్నారు. వినతుల పరిష్కారం సందర్భంగా అర్జీదారులతో ఈ-కేవైసీ చేయించాలని స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాం వినతుల పరిష్కారంపై కలెక్టర్ సోమవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎస్‌డీఅనిత, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, పద్మలత, సుదర్శన దొర తదితరులు వినతులు 283 స్వీకరించి పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు వాటిని పంపించారు.

ఫిర్యాదులపై సత్వర న్యాయం

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన 31 ఫిర్యాదులను ఆమె స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ప్రజల సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, బాధితుల సమస్యలు పరిష్కరించి, చట్టపరిధిలో వారికి న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ ఎస్బీ సీఐలు కేకేవీ. విజయనాథ్, ఇ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో వినతుల పరిష్కారం



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజలనుంచి వచ్చిన వినతులను సత్వరమే పూర్తిస్థాయిలో పరిష్కరించి అర్జీదారుల సంతృప్త స్థాయి పెంచాలని పారతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్ కుమార్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని శాఖల వారిగా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా సహకార అధికారి సన్యాసినాయుడు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎంఎన్ రాణి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి నాయక్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలి

పార్వతీపురంటౌన్: బాధితుల ఫిర్యాదులకు సత్వర న్యాయం జరగాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించిన ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, క్షుణ్ణంగా పరిశీలించారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి బాధితులకు చట్టప్రకారం సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్, ఎస్‌బీ సీఐ సీహెచ్ లక్ష్మణ రావు, డీసీఆర్‌బీ సీఐ ఎన్.వీ ప్రభాకర రావు, ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో వీరభద్రపురం విద్యార్థుల ప్రతిభ



కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కోచ్ రాజాబాబు

కొత్తవలస: విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన గంటా కనకారావు మెమోరియల్ ఇంటర్‌నేషనల్ సౌత్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో కొత్తవలస మండలంలోని వీరభద్రపురం గ్రామానికి చెందిన 8 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు చీఫ్ కోచ్ కె.రాజాబాబు సోమవారం తెలిపారు. వారిలో కె.సంజన, కె.కళాశ్రతలు కాటా విభాగంలో మొదటి స్థానం, సాయి తేజ కుమిటీ విభాగంలో ద్వితీయ స్థానం, కాటా విభాగంలో తృతీయ స్థానం సాధించినట్లు చెప్పారు. నవీన్ కటా విభాగంలో మొదటి స్థానం, ఉమామహేశ్వరరావు కుమిటీ విభాగంలో మొదటి స్థానం, కాటా విభాగంలో తృతీయస్థానం సాధించారన్నారు. సాయి చైతన్య కాటా విభాగంలో మొదటిస్థానం, కుమిటీ లో ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. అలాగే మోహన్‌ప్రకాశ్ కాటా విభాగంలో మొదటి స్థానం సాధించినట్లు వివరించారు. వీరికి పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మెమెంటోలు, మెడల్స్ ప్రదానం చేసినట్లు తెలిపారు.